# ఎవరి విలువలు నాన్నా?

"ఉట్టి కెగరలేనమ్మ స్వర్గానికి ఎగిరినట్టుంది నీ కథ." సుదర్శనం కాస్త కోపంగానే అన్నాడు.

"మీరెన్నయినా అనండి నాన్నగారూ... నేను మాత్రం ఫారిన్‌కు వెళ్ళి తీరాలి", సరిత పట్టుదలగా జవాబిచ్చింది.

"నువ్వు వెళ్ళాలి అనుకోగానే వెళ్ళిపోతావేమిటి? అందరికీ ఉంటాయి గొంతెమ్మ కోరికలు. అనుకోగానే తీరిపోతాయేమిటి?"

"అనుకోగానే తీరిపోవు, ప్రయత్నం చేయాలి. అదే నేను చేస్తానంటున్నది."

"ఏమిటమ్మా ఆ ప్రయత్నం? కాస్త మా చెవిన కూడా వేయి. విని ధన్యులమవుతాము. మా పిల్ల మాకే పాఠాలు చెప్పేంతగా ఎదిగిపోయిందని సంతోషిస్తాం" అంది సౌదామిని.

"మీకెంత చెప్పినా అర్థం కాదు. మీకై మీరు పంపలేరు. నా ప్రయత్నం నేను చేసుకొంటానంటే వినరు" అని సర్రున కుర్చీ లాగి డైనింగ్ టేబిలు వద్ద నుండి లేచింది సరిత.

అప్పుడే రాత్రి భోజనాలు ముగుస్తున్నాయి. ఇంటి విషయాలు, ఇతర విషయాల చర్చలు కూడా అప్పుడే జరుగుతాయి. సౌదామిని ఎన్నోసార్లు చెప్పింది. "సరదాగా మాట్లాడుకొంటూ భోం చేయండి. అంతేగాని అన్నాల ముందు కూర్చుని తర్జనభర్జనలు చేయకండి. కోపతాపాలు చూపించుకోకండి. అది ఆరోగ్యానికి మంచిది కాదు" అని. కాని ఒక్కొక్కసారి ఇవి తప్పేవి కావు.

ఉదయం నుండి తలా ఒక దిక్కుకు పోయే కుటుంబ సభ్యులందరూ కలిసేది రాత్రి భోజనాల దగ్గరే. సరిత యం.ఏ. పూర్తి చేసింది. ఇప్పుడిప్పుడే పబ్లిక్ రిలేషన్స్ అండ్ అడ్వర్టయిజింగ్‌లో డిప్లొమా పూర్తయింది. ఏదైనా మంచి ఉద్యోగంలో చేరాలని ఆ అమ్మాయి తాపత్రయం. తన తమ్ముడు విభు బి.టెక్.లో చేరాడు. తన చదువు పూర్తవటానికి ఇంకా ఐదేండ్లు పడుతుంది. తండ్రి అగ్రికల్చరల్ సైంటిస్టు, తల్లి పార్ట్ టైమ్ లెక్చరరు. ఆమె క్లాసులు సాయంకాలాలుంటాయి. వీళ్ళందరూ వాళ్ళవాళ్ళ పనుల్లో ఉంటున్నా రాత్రి భోజనాలు కలిసి చేయటం మొదటి నుండి వస్తున్న పద్ధతే. అది ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

భోజనాలైన తర్వాత కూడా ఆ విషయమే మాట్లాడుకున్నారు. "చూడు సరితా, ఈ విషయం ఇదివరకే చాలాసార్లు చెప్పాను. నీవు చక్కగా చదువుకున్నావు. అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలో నీకు ప్లేస్‌మెంట్ కూడా రాబోతుంది. ఎక్కడో ఒకచోట ప్రారంభించి కాస్త అనుభవం వచ్చాక పెద్ద పదవుల కోసం చూడాలి గాని, ఒక్కసారిగా ఆకాశం అందుకోవాలనే దురాశ పనికిరాదు."

"ఇవన్నీ పాతకాలం మాటలు నాన్నగారూ. ఎక్కడో ఒకచోట ప్రారంభించటమంటే అట్టడుగు నుండి అనా మీ ఉద్దేశం."

ఇంతలో సౌదామిని కలిగించుకొని "నిచ్చెనకాని, మెట్లు కాని కింద నుంచే ప్రారంభమవుతాయి. కింది మెట్లు ఎక్కకుండా ఒకేసారి పై అంతస్తుకు ఎలా చేరుకొంటావు సరితా?"

"అక్క హైజంప్ గురించి మాట్లాడుతోందిలేమ్మా. కాకపోతే లిఫ్ట్ అనుకో. అక్కడ ఒక మెట్టు కూడా ఎక్కనవసరం లేదు" అని విభూ చమత్కరించాడు.

సరిత నవ్వింది. "వాడు కరెక్టుగా చెప్పాడమ్మా. నిచ్చెన, మేడ మెట్లు ఏనాటి మాట. అట్టడుగున ప్రారంభిస్తే అక్కడే ఉండిపోతాం. ఇప్పుడంతా వేగం. 'స్టార్ట్ బిగ్, థింక్ బిగ్' అంతా మార్కెటింగ్ అమ్మా. మనల్ని మనం ఎలా మార్కెట్ చేసుకోగలం అనే దానిని బట్టి సాఫల్యాలు, విజయాలు, పేరు ప్రతిష్ఠలు."

"ఎక్కడ నేర్చుకొన్నావే ఇవన్నీ. ఇవి మేము నేర్పిన బుద్ధులైతే కాదు" అంది సౌదామిని.

సుదర్శనం నవ్వాడు. "ఈ తరం పిల్లలు నేర్చుకోటానికి వెయ్యి మార్గాలుంటాయి మినీ. అన్నీ కుటుంబం నుండే వస్తాయనుకోకూడదు. కాకపోయినా ఈమె చేసిన డిప్లొమాలో మార్కెటింగ్‌కు ప్రాముఖ్యం ఎక్కువ కదా! అదే మనకు నేర్పిస్తోంది."

"ఇంతకూ నన్ను ఫారిన్‌కు పంపుతారా లేదా?"

"మాకంత స్తోమత లేదమ్మా. నిన్ను చదివించగలిగినంత చదివించాం. విభూ నిలదొక్కుకోటానికి ఇంకా ఆరేడేండ్లు పట్టవచ్చు. అప్పటివరకు బాధ్యతలున్నాయి కదా" అన్నాడు సుదర్శనం.

"ఇప్పుడు నేను ఉద్యోగం చెయ్యను పెళ్ళి చేసుకొంటాను అంటే..." సరిత నిలదీసినట్లు అడిగింది.

భార్యాభర్తలిద్దరికీ నోట మాట రాలేదు. తమ పెంపకంలో సరిత ఇలా తయారయిందంటే నమ్మలేకుండా ఉన్నారు. పిల్లల్ని స్వతంత్ర భావాలతో, స్నేహంగా పెంచిన మాట నిజమే కాని తను ఇంత స్వార్థంగా ఆలోచిస్తుందని...

"సరే పెళ్ళిచేసుకో" తన ఆలోచనలు కట్టిపెట్టి సౌదామిని అంది.

"నీకు చదువు, ఉద్యోగం, కెరీర్ వీటి మీద ఎక్కువ శ్రద్ధనుకొన్నాం. పెళ్ళి చేసుకోవాలంటే... నీ ఇష్టం. ఇంతకూ ఎవరతను?"

"ఎవరు... ఏమిటి?" అర్థం కానట్టు అడిగింది సరిత.

"అవునమ్మా, నీవు పెళ్ళి చేసుకోబోయే వ్యక్తి ఎవరు అని అడుగుతున్నా" సుదర్శనం విశదపరచాడు.

"భలే జోక్ వేశారు నాన్నగారూ. అటువంటి వ్యక్తి ఉన్నాడని నేనెప్పుడయినా మీతో అన్నానా?"

"మరి ఈ పెళ్ళి మాటేమిటి?" సౌదామిని అడిగింది.

"కాదమ్మా నేను చెప్పేదేమిటంటే నేనిప్పుడు పెళ్ళి చేసుకొంటే మీకు ఖర్చవుతుందా కాదా?"

"అయితే..."

"ఆ డబ్బు లక్షో, రెండు లక్షలో నేను ఫారిన్ వెళ్ళటానికి ఇవ్వమంటున్నా" గొప్ప పరిష్కారం కనిపెట్టినట్లు చెప్పింది సరిత.

సౌదామిని సీరియస్ అయిపోయింది. "నీ మార్కెటింగ్ టెక్నిక్కులన్నీ మా దగ్గరే చూపిస్తున్నావా? నీ పెళ్ళికి లక్షలు లక్షలు కూడబెట్టామని నీతో ఎప్పుడన్నాము? మా పెళ్ళికి వంద రూపాయలు కూడా ఖర్చు కాలేదు. సింపుల్, రిజిష్టరు మ్యారేజి. అటువంటి మేము నీకు కట్నమిచ్చి పెళ్ళి చేస్తామని ఎలా అనుకొన్నావు?"

సరిత కొంచెం వెనక్కు తగ్గింది. "మీ ధోరణి మీదే కాని మీ పిల్లలకు ఏమి కావాలో, వాళ్ళ భవిష్యత్తేమిటో ఆలోచించరు" అంటూ అక్కడ నుండి లేచి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి సుదర్శనం, సౌదామిని సరిత గురించి మాట్లాడుకొన్నారు. "వీళ్ళనూ వాళ్ళనూ చూసి పిల్లలు ఏవేవో కోరుకొంటే ఆ కోరికలన్నీ ఎక్కడ తీర్చగలం? కాకపోయినా సరితకు ఇంత ఫారిన్ మోజేమిటి? తన చదువుకు తగిన ఉద్యోగాలు మన దేశంలో లేవా?" అనుకున్నారు.

"ఏదో ఇన్‌స్టిట్యూట్‌లోనో, యూనివర్సిటీలోనో చదువుకోటానికి సీటొచ్చింది అనుకొంటే ఆ పద్ధతి వేరు. పోనీ ఉద్యోగం వచ్చిందంటే అదీ లేదు. ఉద్యోగం వెతుక్కోటానికి ఫారిన్ వెళ్తానంటే ఏ దేశం రానిస్తుంది? అన్నీ సవ్యంగా ఉన్నా వీసా దొరికేది ఎంత కష్టం! ఎన్నెన్ని లక్షలు బ్యాంకు డిపాజిట్లు చూపించాలి? ఎంతెంత ఖర్చులుంటాయి?" తనలో తనే అనుకుంటున్నట్లుగా పైకే అనేశాడు సుదర్శనం.

"ఊరుకోండి. దాని మాటలు పట్టించుకోకండి. ఇక్కడ యాడ్ ఏజెన్సీలో చేరిపోయిందంటే ఫారిన్ గీరిన్ అంతా మరచిపోతుంది" అంది సౌదామిని.

కాని ఆవిధంగా జరగలేదు. సరిత తాను విదేశాలకు వెళ్తాననే జపం వదలలేదు. అమ్మా నాన్నా ఎదురుపడితే ఇదే మాట. తమ్ముడితో కబుర్లలో ఇదే మాట. ఏ ఏ దేశాల్లో ఏ సౌకర్యాలున్నాయో, ఎంత జీతాలున్నాయో, తన ఫ్రెండ్స్, వాళ్ళ బంధువులు ఫారిన్‌లో ఎంత హాయిగా ఉంటున్నారో చెపుతూ ఉంటుంది. స్నేహితులతో ఫోన్ల మీద సుదీర్ఘమైన కబుర్లు. ఎన్నెన్నో ఆరాలు. ఎక్కడెక్కడికో వెళ్తోంది. ఎవరెవరినో కలుస్తోంది.

ఒకరోజు సుదర్శనం అడిగాడు "నీకు ఈ ఫారిన్ పిచ్చేమిటమ్మా? మన దేశంలో ఉండి దొరికిన ఉద్యోగం చేసుకొంటూ ముందుకుపోవటంలో ఉన్న సుఖం విదేశాలలో ఎక్కడుంది? ఎన్నాళ్ళున్నా పరాయి వాళ్ళమే కదా! మన, తన అనే వాళ్ళెవరుంటారు?"

సరిత మాట్లాడలేదు.

"ఆ అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలో వాళ్ళు నీకింకా ఉత్తరం పంపలేదా?"

"పంపారు" అంది సరిత క్లుప్తంగా.

"ఎప్పుడు చేరాలి?"

"పదిహేను రోజులు టైమిచ్చారు."

అప్పుడే అటు వచ్చిన విభూ "గ్రేట్" అన్నాడు.

"ఇంతకూ పార్టీ ఎప్పుడు?" అని అడిగాడు.

"నీ మొఖం" అని గొణిగింది సరిత.

"అదేంటమ్మా నీకు ఫస్ట్ జాబ్ వచ్చిన సందర్భంలో పార్టీ కూడా లేదా?" అని గొణిగాడు.

"పార్టీ మాత్రమేనా? నీకు చక్కటి టీ షర్టు కూడా కొనిపెడ్తాను కాని ఫారిన్ వెళ్ళే ముందు" అని తేల్చి చెప్పింది సరిత.

సుదర్శనానికి చికాకనిపించింది. "ఇంకొక్కసారి ఫారిన్ అన్నావంటే ఊరుకోను. బుద్ధిగా మీడియా మార్కెటింగ్‌లో చేరు."

"ఇక్కడ కూరుకుపోతే ఇక బయటపడను. ఫారిన్‌లో ఉన్న అవకాశాలు, ఆ ధనార్జన ఇక్కడెక్కడున్నాయి?" విసురుగా అడిగింది సరిత.

"పరుగెత్తి పాలు తాగేదానికన్నా..."

"నాకూ తెలుసమ్మా ఆ సామెత. ఇంతగా మన దేశం, మన దేశం అనే మీరు మాత్రం పల్లెటూరు వదిలి చదువులకు పట్టణాలకు, ఉద్యోగాలకు మహా నగరాలకు ఎందుకొచ్చారు? డబ్బు కోసమే కదా! ఇక్కడ మాత్రం మన, తన అనేవాళ్ళు ఎవరున్నారు? మీ తల్లిదండ్రులకంటె మీరొక అడుగు ముందుకు వేశారు. మీ కంటె మీ పిల్లలు ఒక అడుగు ముందుకు వేస్తే మీకెందుకీ బాధ?"

"షటప్" అని సౌదామిని అక్కడి నుండి వెళ్ళిపోయింది. తండ్రివైపు గుర్రుగా చూసి సరిత కూడా తన గదిలోకి వెళ్ళిపోయింది.

"ఇదేదో చిన్న విషయమనుకొంటే ఈ సరిత మొండిపట్టుతో ఇది పెద్ద సమస్యగా మారేటట్టుంది. దీనికేదో మార్గం చూడాలి" అనుకొన్నాడు సుదర్శనం. గట్టిగా తల విదిలించి టి.వి. ఆన్ చేసి క్రికెట్ చూడసాగాడు.

రెండు రోజులు ఇంట్లో సరిత ఉద్యోగం గురించి గాని, ఫారిన్‌కు వెళ్ళే విషయం గురించి గాని ఏ మాటలూ లేవు. అంతా సర్దుకొందనుకొన్నారు తల్లిదండ్రులు. ఒక సెలవు దినం మధ్యాహ్నం భోజనం చేసి సుదర్శనం పడుకొన్నాడు విశ్రాంతిగా. సౌదామిని తన క్లాస్ నోట్స్ తయారు చేసుకొంటోంది. అప్పుడే సరిత బయటి నుండి వచ్చింది. సౌదామిని తలెత్తి చూసి "మేం భోంచేశాం. నువ్వు అన్నం పెట్టుకొని తిను" అంది.

సరిత మొహం కడుక్కొని, బట్టలు మార్చుకొని వచ్చి అమ్మ దగ్గరగా కూర్చుంది.

"వెళ్ళి భోంచెయ్" అంది సౌదామిని.

"నేను ఫ్లొరెన్స్ వాళ్లింటికి వెళ్ళాను అక్కడే భోంచేశాను" అంది సరిత.

సౌదామిని తల ఊపి తన పనిలో నిమగ్నమయింది.

కూతురు అక్కడే కూర్చోటం గమనించి, "ఫ్లొరెన్స్ యం.బి.ఎ. పూర్తి చేసిందా?" అని అడిగింది.

"లేదు సెకండియర్ చేస్తోంది."

"ఇంకెంత తొమ్మిది నెలలే కదా. తనకూ మంచి జాబ్ వస్తుంది" అంది సౌదామిని.

"తనేమిక్కడ పని చేయదు. ఫారిన్ వెళ్తుంది."

"దీస్ యంగ్‌స్టర్స్!" అని గొణుక్కుంది సౌదామిని.

"మీ అందరికీ ఫారిన్ పిచ్చి బాగా పట్టినట్టుంది."

"పిచ్చి కాదమ్మా... అవకాశం. ఫ్లారెన్స్ అన్న డేవిడ్ మా సీనియర్ కదా. ఇప్పుడు చూడు హాయిగా ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేసుకొంటున్నాడు."

"అదీ మంచిదే అయితే ఫ్లారెన్స్ అక్కడికి వెళ్తుందన్నమాట" అంది సౌదామిని.

"అది వచ్చే సంవత్సరం సంగతి. నేనీ సంవత్సరమే వెళ్దామనుకొంటున్నాను."

"ఎక్కడికి?" సౌదామిని ఆశ్చర్యంగా అడిగింది.

"ఆస్ట్రేలియాకి."

"నీవెలా వెళ్తావు? ఏదైనా యూనివర్సిటీలో సీటు దొరికిందా లేక ఉద్యోగం వచ్చిందా?"

"రాలేదు. అక్కడికి వెళ్తే వస్తుంది."

"అని డేవిడ్ చెప్పాడా?"

"నేనే కనుక్కొన్నాను."

"ఆస్ట్రేలియాకు ఎలా వెళ్తావు? టూరిస్టుగానా? టూరిస్టుకు వర్క్ పర్మిట్ ఉండదని తెలుసా?"

"తెలుసు. నేను డేవిడ్‌కు స్పౌస్‌గా వెళ్తాను. ప్రాబ్లెం ఉండదు."

సౌదామినికి నోట మాట రాలేదు. కళ్ళు విప్పార్చుకొని కూతుర్నే చూడసాగింది.

"ఏమన్నావు?" అంది గొంతు పెగల్చుకొని.

"స్పౌస్‌గా వీసా తీసుకొని వెళ్తాను."

"డేవిడ్ భార్యగా వెళ్తావా? నీకు డేవిడ్‌తో పెళ్ళయిందా?"

"కాలేదు. దానికీ దీనికీ సంబంధమేమిటి?"

"మరి భార్యగా ఎలా వెళ్తావు? దానికి ప్రమాణమేమిటి?"

"ఈ కాలంలో అన్ని సర్టిఫికెట్లూ దొరుకుతాయి."

సరిత చెంప ఛెళ్ళుమంది. సౌదామిని ఎన్నడూ తన పిల్లలను కొట్టలేదు. ప్రేమగా పెంచింది. వాళ్ళకు ఫ్రెండుగా నచ్చజెప్పింది. కానీ ఈ క్షణం ఇటువంటిది.

పునాదులతో సహా తను కూలిపోతున్నట్లనిపించింది. ఇదెటువంటి సంస్కారం? తన పిల్లకు ఇటువంటి బుద్ధులెలా వచ్చాయి? దానికున్న విలువలేమిటి? ప్రమాణాలేమిటి? ఆఫ్టరాల్ ఒక ఉద్యోగం కోసం ఎవరికైనా భార్యగా వెళ్ళిపోతుందా? అదీ దొంగ సర్టిఫికెట్‌తో.

ఇంతలో నిద్రలేచిన సుదర్శనం హాల్లోకి వచ్చాడు. తల్లీ కూతుర్ల టెన్షన్ గమనించి "ఏమయింది?" అన్నాడు.

సరిత తనను తాను సర్దుకొని "నేను ఆస్ట్రేలియాకు వెళ్ళాలనుకొంటున్నాను" అంది.

"ఎప్పుడు వెళ్తున్నావేమిటి?" అన్నాడు తండ్రి వ్యంగ్యంగా.

"టిక్కెట్టుకూ, ఇతరత్రా యాభై వేల ఖర్చుంటుంది. మీరెంత త్వరగా ఇస్తే అంత తొందరగా ఏర్పాట్లు చేసుకొంటాను" అంది నిబ్బరంగా.

"ఇంత డబ్బు ఏర్పాటు చేయాలంటే కాస్త టైం పడుతుంది. కాని నువ్వు ఏ బేసిస్ మీద ఆస్ట్రేలియా వెళ్తున్నావో చెప్పలేదు."

"ఇప్పుడు బ్యాంకుల్లో పర్సనల్ లోన్సు కూడా ఇస్తున్నారు కదా..."

"అయితే..."

"డబ్బు ఏర్పాటుకు..."

"ఏమిటీ తాత సొమ్ము దాచినట్లు అంత దర్జాగా అడుగుతున్నావు?" అంది సౌదామిని కోపంగా.

"తాత లేడుగా, తండ్రి సొమ్మే అడుగుతున్నాను. ఆయనకు నా పట్ల బాధ్యత ఉందా లేదా? నా భవిష్యత్తు కోసం ఖర్చు పెట్టాలా వద్దా?" నిక్కచ్చిగా అంది.

"అంత హక్కుగా అడగవలసిందేమీ లేదు గాని నువ్వు ఆస్ట్రేలియా ఎలా వెళ్తున్నావో ముందు చెప్పు."

"నా ఫ్రెండు అన్న అక్కడున్నాడు. అతని భార్యగా వీసా తెచ్చుకొంటాను."

సుదర్శనానికి కళ్ళు తిరిగినంత పనయింది. ఇంత నీచమా? ఇంత స్వార్థమా? ఇరవై మూడేండ్ల పిల్ల ఇంత వక్రంగా ఆలోచిస్తుందా?

"నీకు నీతి నిజాయితీలు లేవా? జీవితంలో విలువలంటూ లేవా? ఇంత చదువూ చదివి ఇదేనా నీవు నేర్చుకొన్నది? కోరినది ఇచ్చి అపురూపంగా పెంచుకొన్నందుకు ఇదా నువ్విచ్చే ప్రతిఫలం?..." ఇక మాట్లాడలేకపోయాడు.

"ఇంతకూ ఆ డేవిడ్ భార్యగా ఎలా వెళ్తుందో అడగండి" అంది సౌదామిని.

సుదర్శనం భావయుక్తంగా కూతురివైపు చూశాడు.

"కొందరున్నారు వాళ్ళు అన్ని సర్టిఫికెట్లూ ఏర్పాటు చేస్తారు" అంది సరిత.

"ఇంత మోసమా? మరొకటి మరొకటి కాదు. పెళ్ళి సర్టిఫికెట్! దాని అర్థం బోధపడిందా?"

కాస్సేపు ఆగి సరిత అంది. "మోసాలు చెయ్యని వాళ్ళెవ్వరున్నారు? చిన్న మోసం, పెద్దమోసం అని మనమన్నంత మాత్రాన మోసం మోసం కాకుండా పోదు. విలువలనేవి నీతి నిజాయితీ అనేవి అన్నిటికీ అన్వయించాలి కదా! మనకు అనుకూలంగా ఉంటే విలువలు లేకపోతే లౌక్యం అనుకొంటే ఎలా?"

"ఏమిటి నీ సిద్ధాంతం? దేని గురించి నువ్వు మాట్లాడేది?" తీవ్రంగా అడిగాడు సుదర్శనం.

"నాన్నా నేనొక సంగతి చెపుతాను. మీరు చెప్పిన విషయమే. మీరే ఆలోచించండి. జానకి అత్త పెళ్ళి ఎలా చేశారు? దొంగ జాతకం వ్రాయించి, దానిని బియ్యపు గాదెలో దాచి పాత జాతకంలా కనిపించేలా చేసి, అవునా? మీరొకసారి ఫీల్డ్ వర్కులో ఉన్నప్పుడు భోజనాల టైమ్‌కు జీపులో వెళ్తున్నారు. అది చిన్న ఊరు. హోటళ్ళనేవి లేవు. అందరికీ ఆకలి. మీరేం చేశారు. మీ డ్రైవరు, హెల్పరు, అడ్వయిజర్లతో పాటు ఒక మఠంలో భోంచేశారు. అందులో ప్రవేశం బ్రాహ్మణులకు మాత్రమే. కాని మీరందరూ బ్రాహ్మణుల్లా నమ్మించారు. అవునా?"

"దీనికీ దానికీ తేడా లేదూ? ఒకరికి మేలు చేయాలని..."

"ఇక్కడా అంతే. నాకు మేలు చేయాలని డేవిడ్ సాయం చేస్తానన్నాడు."

"యూ ఫూల్..."

"నేను ఫూల్‌ని కాదు నాన్నగారూ, ప్రాక్టికల్ మనిషిని. డేవిడ్‌ను నమ్మవచ్చో నమ్మకూడదో, పరాయి దేశంలో ఏం మోసం చేస్తాడో అని మీరనుకోవచ్చు. ఆ విషయంలో నిశ్చింతగా ఉండండి. ఇక నిజాయితీ అంటారా? దానిక్కాస్త నిర్వచనం చెపుతారా? ఆఫీసుకు లేటుగా వెళ్ళటం. ఆఫీసు టైంలో వేరే పనులు చేసుకోవటం, దొంగ కారణాలతో సెలవులు పెట్టటం, లోన్లు తీసుకోవటం, దొంగ మెడికల్ బిల్లులు, ట్రావెల్ బిల్లులు సబ్‌మిట్ చేయటం, సబార్డినేట్ల చేత స్వంత పనులు చేయించుకోటం, ఎక్కడైనా కొంత లాభం ఉందంటే కులం సర్టిఫికెట్లు, వెనుకబడిన సర్టిఫికెట్లు, పుట్టిన తేదీ మార్చే సర్టిఫికెట్లు, తక్కువ ఆదాయాల సర్టిఫికెట్లు... ఒకటేమిటి గౌరవనీయులం, విలువలు గల వాళ్ళం అనేవారు వీటి గురించి

ఆలోచించను కూడా ఆలోచించరు. నిత్యమూ జరిగిపోతూనే ఉంటాయి. మాట్లాడే అవకాశం వస్తే మాత్రం మహానుభావులు, మహర్షులు అయిపోతారు. మాకు, యంగర్ జనరేషన్‌కు గొప్ప ఆకాంక్షలున్నాయి. త్వరగా పైకి పోవాలి. డబ్బు సంపాదించాలి అనే తపన ఉంది. మెటీరియలిస్టిక్ అని మీరంటారు కాని ఇక్కడా అంతే. డిగ్రీల తేడా. 'ఎంతో ఆర్జించాలి' అనే తపన అందరికీ ఉంటుంది. ధనం కాకపోతే పదవి లేదా కీర్తి, ప్రఖ్యాతి, బిరుదులు, ప్రశంసలు. ఎవరేమనుకుంటారో అని మీరు వెనుకాడుతారు. మేము మొహమాటం లేకుండా సాహసం చేస్తాం. ప్రాక్టికల్‌గా ఆలోచిస్తాం."

సుదర్శనానికి మాటలు పెగల్లేదు. కాస్సేపు మౌనం రాజ్యం చేసింది. చివరకు "ఇటీజ్ ఆల్‌రైట్ బేబీ, నువ్వు ఆస్ట్రేలియా వెళ్దువు గాని, అయితే డేవిడ్‌తో నేనొకసారి మాట్లాడాలి" అన్నాడు.

"ఎందుకు నాన్నా?"

"నిన్ను దొంగ సర్టిఫికెటుతో కాకుండా అసలు సర్టిఫికెటుతో పంపుతాను. మీకిద్దరికీ సమ్మతమా?"

సరిత ఆశ్చర్యపోయింది. "దీని గురించి నేనాలోచించలేదు నాన్నగారూ. బహుశా డేవిడ్ కూడా ఆలోచించలేదేమో? ఇదే సరయిన పరిష్కారం అని మీరనుకొంటే... ఇటీజ్ ఓకే విత్ మీ."

సుదర్శనం, సౌదామిని ఒకరినొకరు చూసుకొన్నారు. వీళ్ళ విషయంలో ప్రేమలు, పెళ్ళిళ్ళు అనేవి కూడా అంత ముఖ్యం కాదు. గో గెటర్స్, కావల్సింది పొందాలి. అంతే. "కాలం మారింది" అంది సౌదామిని. "కాదు విలువలు మారాయి" అన్నాడు సుదర్శనం. "ఎవరి విలువలు నాన్నా?" అంది సరిత.

పత్రిక మాసపత్రిక
జూన్ 2004